మా నాన్నగారు మాటల సందర్భంలో ఆ కథ గురించి ఆయనకు చెప్పారు. నేను అది విని ఆశ్చర్యపోయాను. మా నాన్నగారికి నేను కథ రాసిన విషయం ఎలా తెలిసిందా! అని!

అదే అడిగాను.

“ఏవో కాగితాల కోసం వెతుకుతుంటే కనిపించింది. చదివాను బాగుంది. ఈయన కివ్వు! మా కాలేజీ మేగజైన్‌లో కథలు రాసేవాడు. నీ కథ చూస్తాడు,'' అన్నారు.

నేను బిడియపడుతూనే తీసుకొచ్చి ఇచ్చాను.

ఆయన నా కథ చదివి బాగుందని మెచ్చుకున్నారు. కానీ కథకు ముగింపు లేదని ఆయన ముగింపు సూచించారు.

అది విని మానాన్నగారు కూడా మెచ్చుకుని “అలా వ్రాయమ్మా.'' అని ప్రోత్సహించారు.

వాళ్ళ సూచనల ప్రకారం ఏర్పడినదే నాతొలి కథ ఎర్ర చీర. ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికలో ప్రచురింపబడింది.

1979 ఏప్రియల్ 20 వ తారీఖు (20-4-79) సంచికలో ప్రచురింపబడింది. (ఆ కథని ప్రచురించి నన్ను ప్రోత్సహించిన ప్రముఖ పత్రికా సంపాద

## ఎర్ర చీర

దీపావళి పండుగ రోజులు అవటంవలన రామ్‌లాల్ బట్టలకొట్టు చాలా రష్‌గా వుంది. గుట్టలు గుట్టలుగా వున్నాయి చీరలు బల్లల మీద.

ఆ చీర్లన్నీ కొనేయాలన్పించింది జయకి. కానీ కొనుక్కోబోయేది ఒక్కటే. అదైనా యాభై రూపాయల లోపు. అందుకనే బేరం ఎంతకీ తెగడంలేదు.

''జయా తొందరగా కానీ అప్పుడే గంటపైన అయింది వచ్చి ఒక చీరకోసం ఇంతసేపా'' జయ భర్త చలపతి నెమ్మదిగా అన్నాడు.

''మీకేం చెప్తారు. ముష్టి ఏభై రూపాయలిచ్చి చీర కొనుక్కోమంటే ఎలా? ఆ ఎర్రచీర చూడండి ఎంతబాగుందో అది తీసుకోనా'' అంది ఎదురుగా వున్న ఎర్రచీరని చూపిస్తూ.

''అదా నూటయాభైట ఇందాక అతడు చెప్ప లేదా?'' ''అందుకే మరి ఎక్కువ ఖరీదు మీరు పెట్టలేరు! తక్కువ ఖరీదులో మంచి చీర లుండవ్!'' అంది జయ.

''అయితే ఏం చెయ్యమంటావ్'' అన్నాడు విసుగ్గా. ''ఏం లేదు కాస్త ఓపిక పట్టమంటాను.''

''ఊ...కానీ ఏం చేస్తాం తప్పుతుందా మరి!'' సేల్స్‌మాన్ ఓపిగ్గా చూపిస్తున్నాడు. జయ ఒక్కొక్క చీరా చూసి పెదవి విరుస్తోంది.

ఈ ఆడవాళ్ళతో చీరల కొట్టుకు వచ్చినంత న్యూసెన్సు మరొకటిలేదు. జయకి ఎన్నోసార్లు చెప్పాడు. ముందే మనం ఎంతలో చీరలు కొనాలనుకున్నామో సేల్సుమాన్‌కి చెప్పి ఆ చీరలే తీయించమని. కానీ వినదు. వెయ్యి రూపాయల దగ్గరనుండి అన్నీ తీయిస్తుంది. అది బాగుంది కొనవా, ఇది బాగుంది కొననా అని అడుగుతుంది.

అన్నీ తెలిసే అలా అడిగే జయని చూస్తే కోపంతో ఒళ్ళు భగ్గుమంటుంది. కానీ అది షాపు కాబట్టి కోపం తమాయించుకుంటాడు. తనప్పుడు ఆ చీరలన్నీ ప్రక్కకు నెట్టి ''యాభై రూపాయల్లో తీయండి'' అంటాడు. అప్పుడు విసుక్కోవటం సేల్సుమన్ వంతవుతుంది. ఇటు జయ తనకేదో అవమానం జరిగినట్లు బాధ పడిపోతుంది. ముఖం మాడ్చుకుని చలపతి సెలక్టు చేసిన చీర తీసుకుని బయటికి వస్తుంది. ఇలా ప్రతిసారీ జరుగుతూవుంటుంది చీరల తతంగం.

ఇప్పుడు మొదటి ఛాప్టర్ అయింది.

చలపతి ఎదురుగా వున్న చీర్లని పక్కకు నెట్టి 'ఏభై రూపాయల్లో నేతచీరలు చూపండి'' అన్నాడు సేల్సుమేన్ని.

''ముందే చెప్పకూడదండీ! ఈపాటికి మీ బేరమూ అయ్యేదీ'' విసుగుని పైకే చూపాడు సేల్సుమన్. చలపతి ముఖం ఎర్రగా అయింది. కోపంగా జయవేపు చూశాడు. ముఖం తిప్పుకుంది జయ.

జయ సంసారం గురించి ఎప్పుడు అర్థం చేసుకుంటుందో? తనకీ వున్నాయి కోరికలు ఆఫీసరులా టెర్లిన్ బట్టలు వేసుకోవాలని కార్లలో తిరగాలని ఒక్కసారైనా హొటల్ అన్నపూర్ణలో తన భార్యతో ఒక నైట్ గడపాలని. కానీ అవి తీరని కోరికలు. తనలాటివాళ్ళు వున్నదానితో తృప్తి పడడమే నేర్చుకోవాలి. ఈ సంగతి జయకి అనేకసార్లు చెప్పాడు కానీ ఆమె ధోరణి మారదు.

''రండి సార్! రండి'' రామ్‌లాల్ బొంగురు గొంతు విని వెనుదిరిగాడు చలపతి. తన భారీ శరీరాన్ని కుర్చీలోనుండి లేపి గుమ్మంవరకూ దొర్లుకుంటున్నట్లు వెళ్ళి ఎవర్నో ఆహ్వానిస్తున్నాడు రామ్‌లాల్.

''ఎవరా'' అని చూశాడు చలపతి.

ఎవరో భార్యాభర్తలనుకుంటా. సినిమాలో హీరో హీరోయిన్‌లా వున్నారు.

ఎర్రటి పడవలాంటి కారు నీరెండలో షాపు ముందు తళతళలాడిపోతోంది.

''కూర్చోండి సార్'' కుర్చీలు చూపాడు వాళ్ళకి. ఇద్దరూ కూర్చున్నారు.

''రెండు గోల్డుస్పాట్‌లు పట్రారా'' అంటూ పనికుర్రాడికి ఆజ్ఞాపించాడు రామ్‌లాల్.

''గోపాల్ సాబ్! ఈ మధ్య రావడమేలేదు'' అన్నాడు రామ్‌లాల్.

''ఆ! ఏదో పని తొందరలో వుండి. చీరలు త్వరగా చూపండి'' అన్నాడతను వాచీ చూసుకుంటూ.

మరుక్షణంలో ఒక పెద్ద చీరల కుప్ప ఆమె ముందుకు చేరింది.

''రేఖా! చీరలు చూసుకో'' అన్నాడు గోపాల్.

రేఖ తన ముందున్న చీరల్ని చూడటంలేదు. ఆవిడ దృష్టి జయ చేతిలోని చీర మీద వుంది.

''అది చూపండి'' జయ ముందున్న చీరల్ని చూపుతూ అడిగింది రేఖ.

రామ్‌లాల్ ఒళ్ళంతా కదుపుతూ నవ్వి ''అవా అమ్మా అవి మీలాటివాళ్ళ కోసం కాదండీ! అవి నేతచీరలు. ఇవి చూడండి రెండు వందల యాభై నిన్ననే స్టాక్ వచ్చింది. ఇది కొత్త డిజైన్'' అంటూ స్వయంగా చీర మడత విప్పి చూపాడు.

ఎర్రటి చీర మీద పచ్చరంగు డిజైన్.

కానీ రేఖ చూపంతా జయ చేతిలోని చీర మీదే వుంది. వైలెట్ చీరమీద తెల్లటి చుక్కలు పెద్ద ప్రింటున్న పమిటకొంగు చాలా బాగుంది చీర కానీ భర్త దానిని తీసుకోడు ఆయన గౌరవం పోతుంది. భర్తని కాదని తీసుకునే ధైర్యం లేదు తనకి! ఆయనకేది ఇష్టమైతే తనకూ అదే ఇష్టం

కుల-రచయిత-విమర్శకులు అయిన శ్రీ పురాణం సుబ్రహ్మణ్య శర్మగారికి సదా కృతజ్ఞురాలను.)

నేను వ్రాసిన ఆతొలికథనీ నా పేరునీ అచ్చులో చూచుకున్న ఆ అనుభూతిని నేనెన్నడూ మర్చి పోలేను.

అప్పటికి రెండేళ్ళ నుండి బందరు పద్మావతీ కళాశాలలో లెక్చరరుగా పనిచేస్తున్నాను. తొలికథ ప్రచురింపబడే వరకూ మా కొలీగ్స్ ఎవ్వరికి తెలీదు. తెలిశాక మా కొలీగ్స్, స్టూడెంట్స్ నన్ను అభినందించారు.

అందరి ప్రోత్సాహ ఫలితంగా అప్పటి నుండే రచనలు ప్రారంభించాను. వివిధ పత్రికలలో ప్రచురింపబడు తున్నాయి. కానీ ఆ తొలికథ— ఆ అనుభూతి మాత్రం నా మనసులో శాశ్వతంగా నిలిచిపోయాయి. ఏ చీర చూసినా, ఏ బట్టలకొట్టు చూసినా ఆ సంఘటన గుర్తుకు వస్తుంది. దానితో పాటు నాతొలికథ గుర్తుకు వస్తుంది.

ఆషాఢ ప్రథమవర్ష బిందువు భూమిలో అణగి వున్న బీజమును తాకి - దానిని వెలికి తీసినట్లుగా ఆనాటి స్పందననూ, అనుభూతిని మరోసారి గుర్తు చేసి మనస్సుని రసప్లావితం చేస్తున్నది ఈ శీర్షిక।

కావాలి.

మొదటిసారిగా తన నిస్సహాయత మీద కోపం కలిగింది రేఖకు!

''రేఖా! ఇది బాగుంది కదూ'' గోపాల్ మాటలకు తల తిప్పి చూసింది. గోపాల్ చేతిలో జయ కావాలనుకున్న పచ్చటి డిజైన్‌గల ఎర్ర చీర.

''అవునండీ చాలా బాగుంది'' లక్ష రూపా యల కట్నం ఇచ్చి తన భర్త స్టేటస్‌కి ఏవారో అమ్ముడుపోయిన రేఖ లేని నవ్వు తెచ్చుకుంటూ అంది.

''ఇది ప్యాక్ చేయించండి'' అన్నాడు గోపాల్.

రేఖ ఆ చీర తీసుకోవడం చూసి తన ప్రియ మైన వస్తువుని ఎవరో దోచుకుపోతున్నంత దుఃఖం కలిగింది జయకు.

జయ స్థితి గమనించాడు చలపతి! కాస్సే పుంటే అక్కడే ఏడుపు మొదలు పెట్టేట్టుంది. ఈ కొట్లోనుంచి ఎంత తొందరగా బయటపడితే అంత మంచిది అనుకుని—

''ఈ చీర చూడు బాగుందికదూ ప్యాక్ చేయించనా'' అన్నాడు చలపతి వైలెట్ చీర చూపుతూ.

జయ అటువేపన్నా చూడకుండా తలూపింది. రెండు ప్యాకెట్లు కౌంటర్ దగ్గరకొచ్చాయి. గోపాల్ తన బిల్లు చెల్లించాడు.

'' అరేయ్ అయ్యగారి ప్యాకెట్టు కార్లో పెట్టరా'' అన్నాడు రామ్‌లాల్ నౌకరుతో.

చలపతి బిల్లు చెల్లించి తన ప్యాకెట్ తీసుకుని బయటపడ్డాడు.

*

మర్నాడు దీపావళి.

జయ పనంతా అయ్యాక సాయంత్రం పిల్లలకు బట్టలు తొడిగింది. తను కూడా చీర కట్టుకుందా మని గదిలోకి వెళ్ళింది. అలమార్లోనుంచి ప్యాకెట్ తీసి కవరు చింపింది. దాన్లోంచి ఎర్రటి ఫారిన్ నైలెక్స్ చీర బయటపడింది. జయ కళ్ళు విప్పార్చుకు చూసింది.

తను కోరుకున్న చీర ఎలా వచ్చింది. ఆప్యాయంగా చేతిలోకి తీసుకుంది. మెత్తగా, సున్నితంగా ఆ చీర చేతిలో కదిలింది. ముఖానికి దగ్గరగా అన్చుకుంది. కొత్త వాసన మత్తుగా సోకింది.

వాస్తవంలోకి రావడానికి రెండు నిముషాలు పట్టింది జయకు. చీర గురించే ఆలోచించ సాగింది.

బహుశ ప్యాకెట్టు మారుపడిందేమో! భర్తకు చెప్పాలా ఈ సంగతి? అని క్షణం ఆలోచిం చింది. ఊహూ చెప్తే తిరిగి ఇచ్చేసినా ఇవ్వొచ్చు! అటువంటివాడు కూడాను. భగవంతుడు తన మనసులోని కోర్కెను ఇలా తీర్చాడు. ఈ అవ కాశాన్ని తనెందుకు జారవిడుచుకోవాలి? భర్తకు తెలీకుండా రహస్యంగా కట్టుకోవాలి. ఒకవేళ తెలిసినా ఆ టైముకు తోచింది చెప్పొచ్చులే అనుకుంది జయ.

రేఖాదేవి డ్రెస్సింగ్ టేబిల్ ముందు నుంచుని ప్యాకెట్ తీసింది వైలెట్ కలర్ వేతచీర బయట పడింది. ఆశ్చర్యమూ, సంతోషము మిళిత మయ్యాయి ఆమెలో.

''ఇన్నాళ్ళకు భగవంతుడు తన కోరిక ఒక్కటైనా నెరవేర్చాడు'' అనుకుంది ఆనందంగా.

తనే చీర కట్టుకున్నా భర్తకు అక్కర్లేదు. ఇంట్లో భార్య వుంది అనే జ్ఞానం లేని మత్తులో వుంటాడు. తన కిష్టమైన వేత చీర కట్టసాగింది రేఖాదేవి.

*

పిల్లలు, భర్త లేని సమయం చూసి చీర కట్టు కోడానికి గదిలోకి వచ్చింది. పాతకాలపు నిలువు టద్దం ముందు నిలబడింది. చీర మడత విప్పి భుజం మీద వేసుకుంది. అద్దంలో చూసుకుంది. ఎంత బాగుందో ఈ చీర కట్టుకుంటే ఇంకా ఎంత అందంగా వుంటానోకదా అని తలుచుకుంటూ మురిసిపోయింది. భుజం మీద మెత్తగా తగులు తున్న చీర స్పర్శకి తన్మయత్వంతో కళ్ళు మూసు కున్న జయకి ఎవరో ఎదురుగా నిలబడి హేళనగా తనని చూసి నవ్వుతున్నట్లనిపించి గబుక్కున కళ్ళు తెరిచింది. ఎదురుగా తన ప్రతిబింబమే తనని వెక్కిరిస్తోంది.

''ఈ చీర నువ్వు కట్టుకొంటావా ఎవరి డబ్బు తోనో కొనుక్కున్న చీర కట్టుకోవడం నీకు తప్పుగా అన్పించడంలేదా! పొరపాటున మారిపోయిన చీర నీ దగ్గరికి వస్తే నీ స్వంతం చేసుకుంటావా ఇంతేనా నీ సంస్కారం. ఇదేనా నువ్వు చదివిన చదువు. ఇంత నీచంగా ప్రవర్తిస్తావా?''

వేయి గొంతులతో గదంతా ప్రతిధ్వనిస్తున్న ట్లనిపించింది. జయ భరించలేక రెండు చేతుల్తో చెవులు మూసుకుంది.

క్షణం తర్వాత కళ్ళు తెరిచింది. తుఫాను వచ్చి వెలసినప్పటి ప్రశాంతత ఆవరించింది గదిలో. ఎదురుగా అద్దంలో తన రూపం తనకే వికృతంగా కన్పించింది. భుజం మీద చీర ఇప్పుడు మెత్తగాలేదు, అందంగానూ లేదు. ఎర్రటి నాల్కలతో బుసలు కొడుతున్న విషనాగు భుజం మీద మెదులుతున్నట్లనిపించింది. చటుక్కున ఆ చీర తీసి పరుపు మీదికి విసిరేసింది.

''తనెంత అవివేకంగా ప్రవర్తించింది. క్షణం ఆలస్యమైతే ఎంత ఘోరం జరిగిపోయేది. ఈ చీర వెంటనే షాపుకు పంపేయాలి.''

ఆ నిర్ణయానికి వచ్చాక మనస్సు శాంతించింది జయకు!

భర్త ఎప్పుడు వస్తాడా చీర ఎంత తొందరగా షాపుకు పంపుదామా అని వరండాలో భర్తకోసం ఎదురు చూస్తూ నిలబడింది జయ! □